క్లుప్తంగా

1న అపుస్మా జిల్లా సమావేశం



దీఈఓకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న అపుస్మా నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వచ్చే నెల 1వ తేదీన నిర్వహించే ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఏలూరు జిల్లా సర్వసభ్య సమావేశానికి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహాంను ఆ సంఘ నాయకులు ఆహ్వానించారు. మంగళవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో అబ్రహాంను కలిసి ఆహ్వాన పత్రం అందించారు. కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

2న పాఠశాల స్వీపర్ల ధర్నా

ఏలూరు (టూటౌన్): పాఠశాలల టాయిలెట్ల క్లీనర్ల (స్వీపర్లు) ఐదు నెలల జీతాల బకాయిలు చెల్లించాలని కోరుతూ స్కూల్ స్వీపర్ల యూనియన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2న ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు యూనియన్ జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాఠశాల టాయిలెట్ల క్లీనర్స్ 1900 మందికి గత ఐదు నెలలుగా రావాల్సిన బకాయి జీతాలు రూ.3.34 కోట్లు ఉందని పేర్కొన్నారు. నెలకు ఇచ్చే రూ.6 వేలు నామమాత్రపు జీతాలు రాక స్వీపర్లు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారులు, కలెక్టర్ చొరవ తీసుకుని బకాయి వేతనాలు వెంటనే ఇప్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

సభ్యత్వ నమోదుపై సమీక్ష

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా వ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్ కోరారు. స్థానిక అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం సభ్యత్వ నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉండే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేయాలని విక్రమ్ కిషోర్ పిలుపునిచ్చారు.

ఎస్సీ రిజర్వేషన్లను కొనసాగించాలి

ఏలూరు (టూటౌన్): సమాజంలో అంటరానితనం అనే దురాచారం సమసిపోయేంత వరకు ఎస్సీ రిజర్వేషన్లను యథావిధిగా కొనసాగించాలని ఎయిమ్ జిల్లా అధ్యక్షుడు వాసే ఆనంద్ కోరారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల సుప్రీంకోర్టు ఆరుగురు న్యాయమూర్తుల అభిప్రాయమైన రిజర్వేషన్ వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించి ఎస్సీలకు న్యాయం చేయాలని, ఎస్సీ వర్గీకరణ తీర్పును నిరసిస్తూ రివిజన్ పిటీషన్ దాఖలు చేశామని తెలిపారు. పలువురు ఎయిమ్ సంస్థ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిని రక్షించిన రోడ్ సేఫ్టీ మొబైల్ సిబ్బంది



బాధితుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: విజయవాడకు చెందిన మోహన్ అనే వ్యక్తి ఇంటిలో గొడవలు నేపథ్యంలో పారిపోయి ఏలూరు జాతీయ రహదారి కలపర్రు టోల్ ప్లాజా సమీపంలో రోడ్డు పక్కన కూర్చొని బ్లేడ్‌తో తన చేతిని కోసుకున్నాడు. దీంతో హెడ్ కానిస్టేబుల్ కమలాకర్, హోమ్ గార్డ్ రాంబాబు ఘటనా స్థలానికి చేరుకుని రక్తస్రావం అవుతోన్న బాధితుడ్ని 108 అంబులెన్స్‌లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బాధితుడు మోహన్‌ను వారికీ అప్పగించారు. ఏలూరు రోడ్ సేఫ్టీ మొబైల్ సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



నేరస్తులకు కఠిన శిక్షలు విధించాలి



కోల్‌కత్తా ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాలలో పీజీ వైద్యురాలిపై జరిగిన అమానుష దారుణకాండ, హత్యాచారంపై దేశవ్యాప్తంగా వైద్యులతోపాటు, ప్రజల నుంచి తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నేరానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తేనే ఇలాంటి దారుణాలకు పాల్పడే వారిలో భయం వస్తుంది. పీజీ వైద్యులకు ట్రైనింగ్‌లో రోజుల తరబడి డ్యూటీలు వేయటంపైనా పునఃసమీక్ష చేయాలి. మహిళా వైద్యులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్‌లోనూ మహిళా వైద్యులకు రక్షణ కోసం చట్టం చేయాలి.

– డాక్టర్ బి.లోకి కృష్ణ, ఆర్థోపెడిక్ సర్జన్, ఏలూరు

నిరంతరం సెక్యూరిటీ ఉండాల్సిందే



ఉంగుటూరు: అత్యవసర సర్వీసులు అందించే వైద్యులకు ఆయా విభాగాల వద్ద 24 గంటలు పర్యవేక్షణ సెక్యూరిటీ గార్డులు ఉండాలి. ఏదైనా ఇబ్బంది వచ్చినపుడు పోలీసులు తక్షణమే హాజరయ్యేలా టీము పనిచేయాలి. ప్రధానంగా మహిళా డాక్టర్ల వద్ద పూర్తి సెక్యూరిటీ ఉండాలి. ఎమర్జెన్సీ విభాగం, కాజువాలిటీ వద్ద సెక్యూరిటీ పర్యవేక్షణ ఉండాలి. హాస్పిటల్ ప్రవేశ మార్గంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలి. వైద్యులపై దాడులు చేస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలి. అప్పుడే వైద్యులు స్వేచ్ఛగా మెరుగైన వైద్యసేవలు అందిస్తారు.

– డాక్టర్ సుబ్బరాజు వర్మ, చేబ్రోలు, పీహెచ్‌సీ

కొల్లేరు రోడ్డుపై ప్రయాణం.. ప్రాణసంకటం

- అదుపు తప్పుతున్న వాహనాలు
- భయాందోళనలో ప్రయాణికులు

ఏలూరు రూరల్ : కొల్లేరు రోడ్డు పెద్దపెద్ద గోతులు ఏర్పడి అధ్వానంగా మారింది. దీంతో సుమారు 25 కిలోమీటర్ల దూరం ఉన్న కొల్లేరు రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. వాహనచోదకులు అరచేతిలో ప్రాణం పెట్టుకుని పయనించాల్సి వస్తోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొల్లేరు రోడ్లు అభివృద్ధి చెందాయి. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో ప్రభుత్వం సుమారు రూ.10.40 కోట్లు విడుదల చేసి రోడ్లు బాగు చేసింది. ఇందులో మొండికోడు వంతెన నుంచి పైడిచింతపాడు వరకు అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేశారు. ఇందుకోసం ఎండీఆర్ నిధులు రూ.80 లక్షలు ఖర్చు చేసింది. మండల పరిషత్ నిధులు మరో రూ.1.40 కోట్లతో అధికారులు కొక్కిరాయిలంకలో పదుల సంఖ్యలో గ్రావెల్ రోడ్లు, పైడచింతపాడులో సీసీ రోడ్లు నిర్మించారు. తిమ్మారావుగూడెం, కోటేశ్వర దుర్గాపురంలో రోడ్డుకు అనుసంధానంగా సుమారు 12 లక్షలతో ఐదు కల్వర్టులు నిర్మించారు. వీటితో పాటు రూ.20 కోట్లతో కైకలూరు రోడ్డు, శ్రీపర్రు వంతెన నిర్మించారు. గతంలో పాలకులు శ్రీపర్రు రోడ్డు వేస్తామంటూ అనేక వాగ్దానాలు చేసి చేతులు దులుపుకున్న విషయం విదితమే.



మొండికోడు పరిసరాల్లో కొల్లేరు రోడ్డుపై గోతులు దాటుతున్న లారీ



మాదవాపురం వద్ద రోడ్డుపై గోతులు దాటుతున్న చోదకులు



వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి చేసిన కొల్లేరు రోడ్డు (ఫైల్)

కైకలూరు - కొల్లేరు రోడ్డు బాగుంది



కూటమి ప్రభుత్వం రోడ్లు అభివృద్ధి చేపట్టాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొల్లేరు రోడ్డు అభివృద్ధి చేసింది. చరిత్రలో నిలియిపోయే విధంగా కైకులూరు రోడ్డు నిర్మించింది. గతంలో ఈ రోడ్డు అభివృద్ధి చేస్తామంటూ అనేక మంది పాలకులు హామీ ఇచ్చారు. కానీ, మాట నిలబెట్టుకోలేదు. కైకలూరు రోడ్డుపై ప్రయాణిస్తుంటే ఎంతో హాయిగా ఉంటుంది. కుదుపులు లేవు ప్రశాంతంగా ప్రయాణం చేస్తున్నాం.

– మండల కొండలరావు, శ్రీపర్రు

రివెట్‌మెంట్‌తో రోడ్డు నిర్మించాలి



గత ప్రభుత్వం రెండు పక్కలా రివిట్‌మెంట్ కట్టి రోడ్డు అభివృద్ధి చేసింది. అలాగే తిమ్మారావు గూడెం నుంచి పైడిచింతపాడు వరకు రోడ్డుకు రెండుపక్కలా సిమెంట్‌తో రివిట్‌మెంట్ నిర్మించాలి. తర్వాత కొల్లేరు రోడ్డు అభివృద్ధి చేయాలి. అప్పుడే ఎక్కువ కాలం ఉంటుంది. ప్రయాణికుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకోవాలి. టీడీపీ కూటమి ప్రభుత్వం కొల్లేరు రోడ్డు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలి.

– ముంగర సంజీవ్‌కుమార్, వడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్

పేదలకు వస్త్రదానం



పేదలకు వస్త్రదానం చేస్తున్న బిషప్ పొలిమేర జయరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) / ఏలూరు (టూటౌన్): ఏలూరు కథోలిక పీఠం బిషప్ పొలిమేర జయరావు జన్మదిన వేడుకలు స్థానిక బిషప్ హౌస్‌లో మంగళవారం నిర్వహించారు. జయరావు దివ్యబలిపూజ చేశారు. కేకు కట్ చేశారు. వృద్ధులు, వితంతువులకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో ఫాదర్లు మైఖేల్ ఇంజమాల, పి.బాల, జి.మోజెస్, టి.ఇమ్మానియేల్, బి.రాజు, డి.అబ్రహాం, జె.బెనర్జీ, గౌరీపట్నం అన్నదాన ట్రస్ట్ చైర్మన్ కల్లె నాగేశ్వరరావు, ఏలూరు మైకేల్ చర్చి ఫాదర్ ఆరోన్ తదితరులు పాల్గొన్నారు. సెంట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. సెంట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు, బొడ్డు రాజు, బడుగు రామకృష్ణ,గాలంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు. గన్‌బజారులో అక్షర సోషల్ సర్వీస్ సొసైటీ, సిటీ న్యూ క్రిస్టియన్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో జయరావు పుట్టిన రోజు వేడుక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పొలిమేర హరికృష్ణ, సొంగా మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మందులపై జీఎస్టీని ఎత్తివేయాలి



డీఆర్‌ఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మందులపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మెడికల్ సేల్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ పుష్పమణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వీవీఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మా రంగంలో మందుల కంపెనీల దోపిడీ అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అత్యవసర మందులపై జీఎస్టీ ఎత్తి వేయాలని కోరారు. ఫార్మా రంగంలో కంపెనీ యాజమాన్యాలు లేబర్ డిపార్ట్‌మెంట్, సేల్స్ రిప్రజెంటేటివ్స్‌లతో కూడిన కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఫార్మా కంపెనీల్లో మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక రంగంలో కార్మిక చట్టాలను తీసేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా కేంద్ర ప్రభుత్వం మార్చడాన్ని వ్యతిరేకించారు. పాత పద్ధతిలోనే కార్మిక హక్కులు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మొహిద్దీన్, ఉమా మహేష్, దుర్గారావు, శ్రీనివాస్, కిరణ్, గౌతమ్, సీఐటీయూ నాయకులు పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ వైష్ణవ కృష్ణాష్టమి



శేషపాన్పుపై శ్రీకృష్ణుని అలంకరణలో రంగనాథస్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారం జనార్ధన, రంగనాథ స్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీ వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణ చేసి భక్తుల గోత్ర నామాలతో అష్టోత్తర పూజలు చేశారు. శ్రీ రంగనాథస్వామి శేష పాన్పుపై శ్రీ కృష్ణుని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం తిరిగి సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించి, స్వామి వారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు వంగల పవన్ కుమార్ ఆచార్య విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, బిగించిన మీటర్లను వెంటనే విద్యుత్ శాఖ తొలగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కర రావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించేందుకు జీఓ 22ను విడుదల చేశారని తెలిపారు. మీటర్ల బిగింపు వ్యతిరేకించిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ జీఓను రద్దు చేయకపోవడం సరికాదన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే భవిష్యత్తులో ఉచిత విద్యుత్ పథకాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. అన్ని పంటలకు బీమా పథకం వర్తింపజేయాలని, కౌలు రైతులకు పంటల బీమా పథకం అమలు చేయాలని, ఆయిల్‌పామ్, కొబ్బరి తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యాన పంటల సబ్సిడీ బకాయిలు పూర్తిగా రైతులకు చెల్లించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం తగదన్నారు. ప్రాజెక్టులు నిర్వహణకు అవసరమైన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాలను పూర్తిచేసి జిల్లా మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అందించాలన్నారు. కృష్ణా, గోదావరి డెల్టాల కాల్వల ఆధునీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకటరావు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్

ఏలూరు టౌన్: ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాల డీఎస్పీ శ్రావణ్ కుమార్ అన్నారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం సబ్ డివిజన్‌లోని సీఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు చెక్ పెట్టేలా పగలు, రాత్రి నిఘా పెంచాలని, బీట్స్ పెంచాలని ఆదేశించారు. పాత నేరస్తులపై నిత్యం నిఘా ఉంచాలన్నారు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే బాధితులు, ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తూ దర్యాప్తు ముమ్మరం చేయాలన్నారు. నిత్యం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు చేయాలని ఆదేశించారు. వాహనదారులు విధిగా హెల్మెట్ వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. స్కూల్స్, కాలేజీల వద్ద ఈవ్ టీజింగ్ లేకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏలూరు సీఐలు సత్యనారాయణ, వైవీ రమణ, శ్రీనివాస రావు, కైకలూరు టౌన్, రూరల్, భీమడోలు, నిడమర్రు సీఐలు పాల్గొన్నారు.

రైల్వే అండర్‌పాస్‌లో తొలగని వర్షం నీరు

దెందులూరు: దెందులూరు– అలుగులగూడెం రైల్వే గేటు వద్ద అండర్‌పాసులో నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిలిచిన నీటిని రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ తోడించడం లేదు. ఈ అండర్ పాస్ మీదుగా ప్రతి రోజూ విద్యార్థులు, రైతులు, పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు ఈ నీళ్లలో నడిచి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వ్యయంతో షెడ్డు నిర్మించి వర్షం నీరు తొలగించే విషయంలో మాత్రం అశ్రద్ధ చేయడంపై మండలంలో అన్ని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అండర్‌పాసులో నిలిచిన వర్షపు నీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వృద్ధులు, వాహన దారులు కోరుతున్నారు.

రోజుకు రెండు పరీక్షలు నిర్వహించాలి



విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం సమర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ విద్యా సంవత్సరంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించే సెల్ఫ్ ఎసెస్‌మెంట్ పరీక్షలు గతంలో వలే రోజుకు రెండు చొప్పున నిర్వహించాలని పీఆర్‌టీయూ నాయకులు మంగళవారం విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం వెంకటావధానికి వినతిపత్రం అందజేశారు. ఈ పరీక్షలు రోజుకు ఒకటి చొప్పున నిర్వహించాలని నిర్ణయించడం వల్ల విద్యార్థులకు బోధనా సమయం తగ్గి సిలబస్ పూర్తి చేయడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రతి రోజూ ప్రశ్నపత్రాలను గంట ముందుగా మండల విద్యావనరుల కేంద్రం నుంచి తీసుకుని పరీక్షలు నిర్వహించాలన్న నిర్ణయం వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా అసౌకర్యానికి గురౌతారని తెలిపారు. మండల కేంద్రం నుంచి 20 కిలోమీటర్లు దూరంలోని పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు ఉదయమే ఆయా పాఠశాలలకు వెళ్లి, తిరిగి మండల కేంద్రానికి రావడం ఇబ్బంది అవుతుందని వివరించారు. గతంలో వలే స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ ద్వారా పంపిణీ చేయాలని కోరారు. పని సర్దుబాటుకు సంబంధించి ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్న అభ్యంతరాలను పరిష్కరించిన తరువాత మాత్రమే డివిజన్ స్థాయి కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏడీని కలిసిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, రాష్ట్ర కౌన్సిలర్ బెజవాడ ధర్మారావు ఉన్నారు.

చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

దెందులూరు: నాగులదేవునిపాడులో ఆధ్యాత్మికాభివృద్ధికి చర్చి నిర్మాణం తలపెట్టడం సంతోషంగా ఉందని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు అన్నారు. నాగులదేవునిపాడు ఆర్‌సీఎం పారిస్ క్రిస్ట్ ఇంటిగ్నేవియర్ ఆధ్వర్యంలో పీఠాధిపతి జయరావు శంకుస్థాపన చేశారు. ఫాదర్లు మోజెస్, గ్జేవియర్ తదితరులు పాల్గొన్నారు.

చాకుతో దాడి.. ఇద్దరికి గాయాలు

దెందులూరు: దెందులూరులో ఒక యువకుడు చాకుతో దాడి చేసిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయని ఎస్సై కె.స్వామి మంగళవారం తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో దెందులూరు యాదవ బజారుకు చెందిన బత్తిన నాగమహేష్, చేడిగ ఆకాష్ ఏలూరు నుంచి దెందులూరు ద్విచక్రవాహనంపై వస్తుండగా అదే గ్రామంలోని కాశీ కాలనీకి చెందిన వంజరపు అరవింద్ స్థానిక ఎన్‌టీఆర్ బొమ్మ వద్ద నిలుపుదల చేశాడు. బత్తిన నాగమహేష్, చేడిగ ఆకాష్, వంజరపు అరవింద్ మధ్య వాగ్వివాదం పెరిగి ఘర్షణ జరిగింది. అరవింద్ చాకుతో నాగమహేష్‌ను పొట్టలో కుడివైపున పొడిచాడు. ఆకాష్ ఎడమ చేతి మణికట్టుపై దాడి చేశాడు. ఈ ఘటనలో నాగమహేష్, ఆకాష్‌కు గాయాలయ్యాయి. వారిని స్థానికులు దెందులూరు సీహెచ్‌సీకి తరలించారు. నాగమహేష్, ఆకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరవింద్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గణపవరం: మండల సర్పంచ్‌ల చాంబర్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం గణపవరం మండల సమావేశ మందిరంలో నిర్వ హించారు. సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు చనుమూరి దుర్గా భవాని అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చాంబర్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముచ్చర్ల వేణుగోపాల మురళీకృష్ణ (వల్లూరు), ఉపాధ్యక్షుడిగా మల్లంపల్లి సురేష్ (వెంకట్రాజపురం), కోశాధికారిగా చుక్కా అప్పారావు (చిలకంపాడు), సభ్యులుగా గుర్రంసుబ్బారావు (వరదరాజపురం), ఆదిమూలం సురేష్(వాకపల్లి), బాతు నాగేశ్వరావు (జల్లికాకినాడ) ఎన్నికయ్యారు.

ఆ అధికారులను మార్చండి మహాప్రభో!

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇటీవల విద్యుత్ శాఖలో బదిలీల ప్రక్రియకు మార్గదర్శకాలు విడుదలైన నాటి నుంచీ పలువురు అధికారులు, ఉద్యోగులు పైరవీలకు తెరతీశారు. తమకు నచ్చిన ప్రాంతాల్లో పోస్టింగుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొందరు జిల్లా స్థాయి అధికారులు పక్క జిల్లాకు వెళ్లినట్టే వెళ్లి, మళ్లీ ఇక్కడే తిష్ట వేయడం ఆందోళన నెలకొంది. స్పౌజ్ వర్కింగ్ అనో, ఉమెన్స్ కోటా అనో ఏదో ఒక సాకు చూపి ఏళ్ల తరబడి ఏలూరులోనే ఉంటూ, కింది స్థాయి ఉద్యోగులతో గ్రూపులు కట్టి మిగిలిన ఉద్యోగులను వేదింపులకు గురి చేస్తున్నారని బాధిత ఉద్యోగులు వాపోతున్నారు. వీరిలో అధికారులు కూడా ఉండడం గమనార్హం. ఇటీవల విద్యుత్ భవన్లో జరిగిన గొడవలకు వీరే పరోక్ష కారణంగా చెబుతున్నారు. జేఏఓ స్థాయి నుంచి సీనియర్ అకౌంట్స్ అధికారిగా, ఏఈ స్థాయి నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా ఇక్కడే ఉండి పోయి వారిని ప్రశ్నించిన వారిపై విద్యుత్ భవన్‌లోని ఒక సీనియర్ అసిస్టెంట్‌తో మిగిలిన ఉద్యోగులు, అధికారులు, నాయకులపై తప్పుడు ఫిర్యాదులు పెట్టించి వైషమ్యాలు సృష్టించి తమ జోలికి రాకుండా చూసుకుంటున్నారని బాధిత ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ అధికారులను సమయంతో సంబంధం లేకుండా అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్‌లో బదిలీ చేసి ఉద్యోగులు మంచి వాతావరణంలో పనిచేసేట్లుగా చర్యలు తీసుకోవాలని సీఎండీకి వినతిపత్రాలు పంపుతున్నారు.

జాబితాలు సిద్ధం

కాగా తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఐదేళ్ల ఒకే ప్రాంతంలో సర్వీసు పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఏలూరు సర్కిల్ పరిధిలో 25 మంది ఏడీఈలు, ఏఈలు ఈ జాబితాలో ఉన్నారు. విద్యుత్ రెవెన్యూ విభాగంలో సైతం బదిలీలకు అర్హులైన ఉద్యోగుల జాబితా సిద్ధం చేశారు. వీరిలో ఏలూరు ఏఏఓ, భీమవరం ఏఏఓ కూడా ఉన్నారు. ఇదిలా ఉండగా ఈ జాబితాల్లో ఉన్న వారిలో కొందరు ఉద్యోగులు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి ఇప్పటికే సీఎండీకి సిఫార్సు లేఖలు సమర్పించినట్టు తెలుస్తోంది. మరికొందరు మార్గదర్శకాల్లోని మినహాయింపుల నిబంధనలను అడ్డు పెట్టుకుని బదిలీ కాకుండా ఉండేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారని చర్చ నడుస్తోంది.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - తిరుపతి	16.00	4830	23